క్లుప్తంగా

మండల కమిటీ ఎన్నిక



ఆనంద్, అధ్యక్షుడు   జలీల్, ప్రధాన కార్యదర్శి

టేకుమట్ల: ఎస్టీయూ టీఎస్ మండల కమిటీని జిల్లా అధ్యక్షుడు రమేశ్‌నాయక్, జిల్లా సీనియర్ నాయకుడు కుర్రె ప్రవీణ్ ఆధ్వర్యంలో శనివారం మండల కేంద్రంలో నియమించారు. మండల అధ్యక్షుడిగా నేరుపాటి ఆనంద్, ప్రధాన కార్యదర్శిగా జలీల్‌ను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి గణేష్, తదితరులు పాల్గొన్నారు.

సేవాభావం కలిగి ఉండాలి



చిట్యాల: సమాజంలో ప్రతి ఒక్కరూ సేవాభావం కలిగి ఉండాలని చిట్యాల రెండో ఎస్సై ఎండి.షాఖాన్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో సిరి పెరల్స్ అండ్ జ్యువెలరీ హనుమకొండకు చెందిన శానం శివ జన్మదినాన్ని పురస్కరించుకుని ఉమా–శివ దంపతులు విద్యార్థులకు బ్యాగులు, డిక్షనరీలు, పరీక్ష ప్యాడ్లు అందించగా ఎస్సై చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు బాగా చదువుకుని భవిష్యత్‌లో ఉద్యోగాలు సాధించి ఇలాంటి సేవా భావాలు అలవర్చుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ అఖిల, మాజీ ఎంపీటీసీ కట్కూరి పద్మ నరేందర్, ప్రధానోపాధ్యాయుడు శ్రీరాం రఘుపతి, దేవేందర్‌రెడ్డి, నాగరాజు, ఉపాధ్యాయులు నీలిమారెడ్డి, బుర్ర సదయ్య, శ్రీనివాస్, సదయ్య, అమ్మ ఆదర్శ కమిటీ చైర్‌పర్సన్ చిదిరాల సరోజన తదితరులు పాల్గొన్నారు.

‘చర్య తీసుకోవాలి’



భూపాలపల్లి రూరల్: నకిలీ పత్రాలు సృష్టించి కబ్జాలకు పాల్పడుతున్న భూ కబ్జాదారులపై అధికారులు చర్య తీసుకోవాలని గణపురం మండలం కుందురుపల్లి గ్రామానికి చెందిన నంగవత్ సుశీల, లావుడ్య ప్రమీలతోపాటు రఘునాయక్‌లు డిమాండ్ చేశారు. శనివారం కుందురుపల్లిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. కుందురుపల్లి గ్రామ శివారులోని 1189/5 సర్వేనంబర్ గల రెండెకరాల అసైన్డ్ భూమిలో 60 సంవత్సరాల నుంచి సాగుచేస్తు కాస్తులో ఉన్నామని, తమకు వారసత్వంగా వచ్చిన భూమి అని, అన్ని హక్కులు పత్రాలు కలిగి ఉన్నాయని తెలిపారు. అయితే, ఓ నాయకుడు ఆ భూమి మీద కన్నేసి 1969లో 1189/15, 16,17,18 నంబర్లతో తన తండ్రి నుంచి కొనుగోలు చేసినట్లు నకిలీ పత్రాలు సృష్టించాడని ఆరోపించారు. 1992లో ములుగు సబ్ డివిజన్‌గా మారిందన్నారు. సబ్‌డివిజన్‌గా మారకముందు సర్వే నంబర్లకు బైనంబర్లు లేవన్నారు. 1969లో బైనంబర్లతో ఏలా కొనుగోలు చేశాడని, అవి నకిలీ పత్రాలని అందరికి తెలిసిపోయినప్పటి అధికారులు అతడికి వత్తాసు పలుకుతున్నారని ఆరోపించారు. అధికారులు 60 సంవత్సాల నుంచి రికార్డులను, లింకు డ్యాకుమెంట్లను పరిశీలించి కోర్టుకు సరైనా పత్రాలు అందించి కబ్జాదారుడిపై చర్య తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

ఆధునికత వైపు అడుగులు

నర్సరీల్లో మిరప నారు పెంపకంపై రైతుల ఆసక్తి
- షేడ్ నెట్ నర్సరీలకు పెరుగుతున్న డిమాండ్
- ఎకరం నారుకు రూ.15వేల ఖర్చు


నర్సరీలో పెంచుతున్న మిరపనారు


రైతు పొలంలో ఏర్పాటు చేసిన మినీ షేడ్‌నెట్ నర్సరీ

రేగొండ: రైతులు ఆధునిక వ్యవసాయం వైపు అడుగులు వేస్తున్నారు. వ్యవసాయ రంగంలో పాత పద్ధతిలో కూలీల కొరతతో పాటు పంట నష్టం కొంత మేర ఉండటంతో అట్టి సాగుకు స్వస్తి పలికి ఆధునిక సాగును ప్రారంభిస్తున్నారు. ప్రస్తుతం కూలీలతో పాటు వ్యవసాయ రంగానికి అనుసంధానంగా ఉన్న వాటికి డిమాండ్ పెరుగుతోంది. అందులో మిరుప నారు పెంచే షేడ్ నెట్ నర్సరీల వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా సాగుతోంది. గతంలో మిరుప నారు పెంపకం దుక్కిని దున్నడం, ఎరువులు చల్లడం, విత్తనాలు పెట్టించడంతో పాటు చీడపీడలు, తెగుళ్ల నుంచి కాపాడడం ఇలా దాదాపు 40 రోజుల కష్టపడాల్సి వచ్చేది. కానీ ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. నర్సరీల్లో విత్తనాలు ఇచ్చి నారు పెంపకం చేపడుతున్నారు. చాలా మంది రైతులు దీని వైపే మొగ్గ చూపిస్తుండటంతో వీటికి డిమాండ్ బాగా పెరిగింది. దీంతో రైతులు మినీ షూడ్‌నెట్ నర్సరీలను ఏర్పాటు చేసి మిరుప నారు పెంచుతున్నారు.

తెగుళ్ల, చీడపీడల బెడద తట్టుకోలేక..

మిరప నారు పెంపకంలో అశ్రద్ధగా ఉంటే మొదటికే మోసం వస్తుంది. విత్తనాలు పెట్టినప్పటి నుంచి నారుమడిని కంటికి రెప్పలా కాపాడుకోవాల్సి ఉంటుంది. వర్షాలు అధికమైతే నారుమడిలో తెగుళ్ల సోకి నారు చనిపోయే పరిస్థితి ఏర్పడుతుంది. వాతావరణంలో మార్పుల కారణంగా చీడపీడల ఉధృతి అధికంగా ఉంటుంది. వీటన్నింటిని దృష్టిలో ఉంచుకోని రైతులు నర్సరీల్లో పెంపకాని మొగ్గ చూపుతున్నారు.

15 నుంచి 20 లక్షల మొక్కల పెంపకం

జిల్లాలో 10 షేడ్‌నెట్ నర్సరీలను ఏర్పాటు చేశారు. ఒక్కో దానిలో సుమారు 15 లక్షల నుంచి 20 లక్షల వరకు మిర్చి నారును పెంచుతున్నారు. కాగా ఒక్కో మొక్కకు 60 పైసల నుంచి 90 పైసలు చొప్పున రైతుల నుంచి నిర్వాహకులు వసూలు చేస్తుంటారు. ఇలా కేవలం నారు పెంపకం చేపట్టేందుకు ఎకరాకు సుమారుగా రూ. 15 వేల పైగా ఖర్చు వస్తుంది. అయినా ఖర్చుకు వెనుకాడకుండా వీటిలోనే పెంచేందుకు రైతులు ఆసక్తి చూపుతున్నారు. విత్తనాలు నాటే దగ్గర నుంచి 50 రోజుల వరకు నిర్వాహకులే ఎటువంటి తెగుళ్లు, చీడపీడలు ఆశించకుండా నారును సాకుతుంటారు. ఇవే కాకుండా రైతులు స్వతంగా తమ పొలంలో సుమారుగా 20 మినీ షేడ్ నెట్ నర్సరీలను ఏర్పరుచుకున్నారు.

మినీ నర్సరీ ఏర్పాటు చేసుకున్నా..



మిరపనారు పెంపకం కోసం ఏడాదికి రూ.వేలు ఖర్చు పెట్టాల్సి వస్తుంది. ఓ స్వచ్ఛంద సంస్థ సహకారంతో సుమారుగా రూ.10 వేలతో నా సొంత భూమిలో మినీ నర్సరీ ఏర్పాటు చేసుకున్నా. సుమారుగా లక్ష మొక్కల పెంపకం చేపట్టా. దీంతో నారు పెంపకం ఖర్చు పూర్తిగా తగ్గింది.

–నాంద్రే రవీందర్, రైతు, నిజాంపల్లి

నాణ్యమైన నారు అందిస్తున్నాం..



నర్సరీల్లో నాణ్యమైన నారు రైతులకు అందుబాటులో ఉంది. నర్సరీల్లో నారు పెంపకానికి రైతులు ఆసక్తి చూపుతున్నారు. నాణ్యమైన నారును 40 నుంచి 50 రోజుల్లో పెంచి అందిస్తాం. అందుకు మొక్కకు రూ.60 పైసలు చొప్పున వసూలు చేస్తాం. ఖర్చు ఎక్కువ అయినా రైతులకు ప్రయోజనమే.

–చాడ తిరుపతి రెడ్డి, నర్సరీ నిర్వాహకుడు

లైసెన్స్ పొందిన నర్సరీల్లోనే..



ఉద్యానశాఖ ద్వారా లైసెన్స్ పొందిన నర్సరీల్లోనే రైతులు మిరుపనారు పెంపకం కొనుగోలు చేపట్టాలి. అంతేగాక నర్సరీల్లో కొనుగోలు చేసిన మిరుపనారు మొక్కల వివరాలతో కూడిన రశీదును పొంది భద్రపరుచుకోవాలి. కొంత మంది రైతులు తమ సొంత పంట పొలాల్లోనే నర్సరీ ఏర్పా చేసుకుని నారు పెంచుకుంటున్నారు. అధికారుల సలహాలు తీసుకోవడం మంచిది.

– సంజీవరావు, జిల్లా ఉద్యాన అధికారి

‘హరితహారం’పై గొడ్డలివేటు


నరికివేసిన చెట్టు

చిట్యాల: హరిత హారంలో భాగంగా రెండు సంవత్సరాల క్రితం మండల కేంద్రంలో నాటిన చెట్టును శనివారం ఓ వ్యక్తి నరికి నేల కూల్చాడు. ఏపుగా పెరిగిన చెట్టును నరకడంతో వన ప్రేమికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సీసీ కెమెరాల ఏర్పాటుకు అడ్డు వస్తుందనే కారణంతో చెట్టును నరికి వేసినట్లు సమాచారం. ఈ విషయంపై పంచాయతీ కార్యదర్శిని వివరణ కోరగా తనకేమీ సమాచారం లేదని అన్నారు.

ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలి


మాట్లాడుతున్న దామోదర్

రేగొండ: పిల్లలను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలని చైల్డ్ వెల్ఫేర్ కమిటీ మెంబర్ దామోదర్ అన్నారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో చైల్డ్ హెల్ప్ లైన్ జిల్లా కో ఆర్డినేటర్ తిరుపతి ఆధ్వర్యంలో ఐకేపీ, వీఓఎలకు బాలల హక్కులు, చట్టాలు, మాదక ద్రవ్యాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎస్సై సందీప్‌కుమార్, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ మెంబర్ దామోదర్ హాజరై మాట్లాడారు. తల్లిదండ్రులు పిల్లల అలవాట్లను గమనిస్తూ వారితో కొంత సమయం గడపాలన్నారు. పిల్లలకు శారీరక, మానసిక సమస్యలు ఉంటే 1098 టోల్ ఫ్రీ నంబర్‌కు సమాచారం అందించాలన్నారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. జిల్లా సఖీ సెంటర్ గాయత్రి, ఉమెన్ హబ్ అనూష, ఏపీఎమ్ తిరుమల్ సింగ్ పాల్గొన్నారు.

వంతెన పనులు త్వరగా పూర్తిచేయాలి


వంతెన నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

టేకుమట్ల: మండలంలోని టేకుమట్ల–రాఘవరెడ్డి పేట వంతెన పునఃనిర్మాణ పనులను త్వరితగతిన పూర్తిచేయాలని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు ఆదేశించారు. శనివారం పనులను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ గతేడాది భారీ వరదలకు వంతెన కూలిపోగా.. అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే రూ.5కోట్ల నిధులు కేటాయించి పనులు ప్రారంభించినట్లు తెలిపారు. 99శాతం పనులు పూర్తయ్యాయని.. వచ్చేనెల మొదటివారంలో వంతెనను ప్రారంభిస్తామన్నారు. ఎమ్మెల్యే వెంట కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కోటగిరి సతీష్‌గౌడ్, మాజీ జెడ్పీటీసీ పులి తిరుపతిరెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బండి సుదర్శన్ గౌడ్, మాజీ ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు సంగి రవి, కత్తి సంపత్, నాంపెల్లి వీరేశం, శాస్త్రాల కిరణ్, బిక్కినేని సంపత్‌రావు, ఉమేందర్‌రావు, కట్కూరి నరసింహారెడ్డి ఉన్నారు.

స్ట్రక్చరల్ సమావేశాలు నిర్వహించాలి


సంతకాల సేకరణ చేస్తున్న నాయకులు

భూపాలపల్లి అర్బన్: కార్మికుల సమస్యల పరిష్కారానికి సింగరేణిలో స్ట్రక్చరల్ సమావేశాలు నిర్వహించాలని సింగరేణి కాలరీస్ ఎంప్లాయీస్ యూనియన్ బ్రాంచీ కార్యదర్శి కంపేటి రాజయ్య డిమాండ్ చేశారు. కార్మికుల సమస్యల పరిష్కారం కోసం సింగరేణి కాలరీస్ ఎంప్లాయీస్ (సీఐయూటీ) యూనియన్ ఆధ్వర్యంలో చేస్తున్న సంతకాల సేకరణ కార్యక్రమం శనివారం ఏరియాలోని సింగరేణి ఏరియా ఆస్పత్రి, కేటీకే 5వ గనిలో చేపట్టారు. ఈ సందర్భంగా రాజయ్య మాట్లాడుతూ.. గత ఆర్థిక సంవత్సరం లాభాలను ప్రకటించి 35శాతం వాటాను ప్రకటించాలని డిమాండ్ చేశారు. కోల్ ఇండియాలో 2011లో అగ్రిమెంట్ అయిన అలవెన్స్‌లపై ఐటీ మాఫీ ఒప్పందాన్ని సింగరేణిలో అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఐటీ మాఫీ చేయకపోవడంతో ప్రతి సీనియర్ కార్మికుడు సంవత్సరానికి రూ.లక్షకు పైగానే ఆదాయపన్ను చెల్లిస్తున్నారని ఆరోపించారు. గుర్తింపు సంఘం ఎన్నికల్లో గెలుపొందిన సంఘాలకు ఇప్పటివరకు గుర్తింపు పత్రాలు ఇవ్వకపోవడంతో స్ట్రక్చరల్ సమావేశాలు నిర్వహించడం లేదని అన్నారు. సింగరేణి యాజమాన్యం వెంటనే సమావేశాలు ఏర్పాటుచేసి కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో కార్మికులు, నాయకులు ఉమ, శంకర్, ఏసుబాబు, శంకర్, నారాయణ పాల్గొన్నారు.

పాఠశాలల్లో కృష్ణాష్టమి వేడుకలు


మల్హర్: శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలో చిన్నారులు

మల్హర్: మండలంలోని తాడిచర్ల సాయివాణి విద్యా నికేతన్ పాఠశాలలో శనివారం ముందస్తు కృష్ణాష్టమి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలో అలరించారు. పాఠశాల ఆవరణలో ఉట్టికొట్టే కార్యక్రమం నిర్వహించారు. ఉపాధ్యాయులు కృష్ణాష్టమి విశిష్టతను విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ సంపత్‌రావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కాటారం: మండల కేంద్రంలోని ఆదర్శ హై స్కూల్, కేంబ్రిడ్జి హై స్కూల్‌తో పాటు చింతకాని ప్రభుత్వ పాఠశాలలో శనివారం ముందస్తు కృష్ణాష్టమి వేడుకలు నిర్వహించారు. చిన్నారుల కేరింతలు, ఆహ్లాదకరమైన వాతావరణంలో ఉట్టి కొట్టె కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా పాఠశాలల్లో విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమాల్లో ఆదర్శ విద్యాసంస్థల చైర్మన్ జనగామ కరుణాకర్‌రావు, పాఠశాలల కరస్పాండెంట్లు జనగామ కార్తీక్‌రావు, హెచ్‌ఎంలు కృషిత, పృథ్వీరావు, ప్రభుత్వ పాఠశాల ఇన్‌చార్జ్ హెచ్‌ఎం గందు రాజబాబు పాల్గొన్నారు.

మహాముత్తారం: మండలంలోని ములుగుపల్లి ఉన్నత పాఠశాలలో ముందస్తు కృష్ణాష్టమి వేడుకలు నిర్వహించారు. పాఠశాలలో ఆరోవ తరగతి చదువుతున్న అభినందన్ కృష్ణుడి వేషధారణ, బలరాముడిగా సుజ్ఞాన్‌తో పాటు పావని, హర్షిత, పావనిలు గోపికల వేషధారణ వేశారు. ఉపాధ్యాయ బృందం రాజేంద్రప్రసాద్, అనిల్, సకరంనాయక్, కామిడి సతీష్‌రెడ్డి, చంద్రకళ, సుదాకర్‌రెడ్డి, సదయ్య, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

కాళేశ్వరం: మహదేవపూర్ మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో ముందస్తుగా శ్రీకృష్ణాష్టమి వేడుకలను పలు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో శనివారం ఘనంగా నిర్వహించారు. మహదేవపూర్, కాళేశ్వరం గ్రామాల్లోని పాఠశాలల్లో చిన్నారులు శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణల్లో అలరించారు. అనంతరం ఉట్టికొట్టే వేడుకను ఘనంగా నిర్వహించారు.


కాళేశ్వరం: ఉట్టి కొడుతున్న చిన్నారులు


భూపాలపల్లి అర్బన్‌లో..


భూపాలపల్లి అర్బన్: శ్రీకృష్ణ, గోపిక వేషధారణలో విద్యార్థులు


మహాముత్తారం: ములుగుపల్లిలో..


కాళేశ్వరంలో..

కాచి చల్లార్చిన నీటిని తాగాలి


మొగుళ్లపల్లి: మెట్టుపల్లిలో పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు


కాటారం: విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న వైద్యురాలు మౌనిక

మొగుళ్లపల్లి: ప్రతి ఒక్కరూ కాచి చల్లార్చిన నీటిని తాగాలని డాక్టర్ నాగరాణి అన్నారు. మండలంలోని మెట్టుపల్లి గ్రామంలో మొగుళ్లపల్లి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని డాక్టర్ నాగరాణి శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వర్షాకాలంలో సీజన్ వ్యాధులు వచ్చే అవకాశం ఉందని ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. వేడివేడి ఆహార పదార్థాలు తినాలని సూచించారు. ఈ వైద్య శిబిరంలో 52 మందికి పరీక్షలు నిర్వహించి ముగ్గురికి రక్త నమూనాలను తీసి ల్యాబ్‌కు పంపించినట్లు తెలిపారు. అలాగే వేములపల్లి గ్రామంలోని అంగన్‌వాడీ సెంటర్లను, పాఠశాలలను తనిఖీ చేసి సీజన్ వ్యాధులపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పల్లె దవఖాన వైద్యాధికారిణి డాక్టర్ సంధ్యారాణి, సూపర్‌వైజర్ జమున, ఏఎన్‌ఎం స్వరూప, ఆశ వర్కర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు ప్రజలు పాల్గొన్నారు.

వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

కాళేశ్వరం: సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మహదేవపూర్ ప్రభుత్వ సామాజిక ఆస్పత్రి సూపరింటెండెంట్ గంట చంద్రశేఖర్ అన్నారు. శనివారం ఆయన విలేకర్లతో ఆస్పత్రిలో మాట్లాడారు. ఇంటి పరిసరాల్లో దోమల లార్వా వృద్ధి చెందే ప్రదేశాలను సకాలంలో గుర్తించి, నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు. 24 గంటలు అందుబాటులో ఉంటూ ఆస్పత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్యం అందిస్తున్నట్లు తెలిపారు. ఐదు మండలాల నుంచే కాకుండా మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల నుంచి రోగులు వచ్చి వైద్య సేవలు పొందుతున్నారన్నారు. ఆస్పత్రిలో సమస్యలను ఎప్పటికప్పుడు మంత్రి, ఆస్పత్రి చైర్మన్ శ్రీధర్ బాబు, కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి వారి ఆదేశాల మేరకు పరిష్కరించే దిశగా ముందుకు వెళ్తున్నట్లు వివరించారు.

వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి

కాటారం: హాస్టళ్లలో ఉండే విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని మండల వైద్యాధికారిని మౌనిక సూచించారు. మండల కేంద్రంలోని గిరిజన సంక్షేమ బాలుర గురుకుల కళాశాలలో శనివారం వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. వైద్య సిబ్బంది విద్యార్థులకు జ్వర, రక్త హీనత పరీక్షలు, పలు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. వంటశాలలు, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని, వేడి పదార్థాలను ఎప్పటికప్పుడు తయారు చేసి విద్యార్థులకు వడ్డించాలని హాస్టల్ సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌ఎచ్‌పీ తిరుపతిరెడ్డి, హెల్త్ అసిస్టెంట్ సమ్మయ్య, ఆశ వర్కర్లు లత, స్వరూపరాణి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

భూపాలపల్లి రూరల్: విద్యుత్ మరమ్మతుల కారణంగా నేడు(ఆదివారం) పట్టణంలోని మంజూరునగర్ ఫీడర్ పరిధిలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్‌శాఖ ఎస్‌ఈ విశ్వాస్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జవహర్ నగర్, 5 ఇంక్‌లైన్, మైసమ్మ కాలనీ, పుల్లు రామయ్యపల్లి, మంజూరునగర్, బీసీ కాలనీ, జీఎంఆర్ వెంచర్, వెంగళరావు వెంచర్, కుందూరుపల్లి, మాధవరావుపల్లి ప్రాంతాల్లో ఉదయం 8 గంటల నుంచి ఉదయం 11:30 వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు.

వారసంత నిర్వహణకు వేలం


వేలంలో పాల్గొన్న గ్రామస్తులు

మొగుళ్లపల్లి: మండల కేంద్రంలో ప్రతి శుక్రవారం నిర్వహించే కూరగాయల మార్కెట్ సంత నిర్వహణకు శనివారం మండల ప్రత్యేక అధికారి సునీత ఆధ్వర్యంలో గ్రా మ పంచాయతీ ఆవరణలో వేలం పాట నిర్వహించారు. సుమారు 17 మంది వేలంలో పాల్గొనగా సంవత్సరానికి రూ.35,500లతో నిమ్మల సారయ్య దక్కించుకున్నాడు. ఈ సందర్భంగా నిమ్మల సారయ్య మాట్లాడుతూ... మార్కెట్ సంతకు వచ్చే వ్యాపారవేత్తలు, స్థానిక వ్యాపారులు, ప్రజలు అందరూ పూర్తిస్థాయిలో సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నరేష్, కారోబార్ అబ్బు, జీపీ పాలక మండలి మాజీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ


రాజేశ్వర్‌రావు కుటుంబాన్ని పరామర్శిస్తున్న వెంకటేశ్వర్‌రావు

మొగుళ్లపల్లి: మండల కేంద్రానికి చెందిన తిప్పారపు రాజేశ్వర్‌రావు, కాంటాల సుధాకర్ అనారోగ్యంతో ఇటీవల మృతి చెందారు. దీంతో బాధిత కుటుంబాలను బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు నాగుర్ల వెంకటేశ్వర్‌రావు శనివారం పరామర్శించారు. ఆయన వెంట చదువు అన్నారెడ్డి, పున్నంచందర్‌రావు తదితరులు ఉన్నారు.